క్లుప్తంగా

పంట కోతల్లో జాగ్రత్తలు పాటించాలి



రైతుభరోసా కేంద్రంలో వ్యవసాయ శాఖ సిబ్బంది శిక్షణ ఇస్తున్న మండల ఎఎస్ఓ దాసు

దెందులూరు: పంట కోత ప్రయోగంలో వ్యవసాయ శాఖ సిబ్బంది ఆ శాఖ నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలని దెందులూరు మండల ఎఎస్ఓ దాసు అన్నారు. శనివారం దెందులూరు మండల వ్యవసాయశాఖాధికారి గద్దె రమేష్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సిబ్బందికి ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కోతలు కోసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిబంధనలు, విధినిర్వహణ, లక్ష్యాలు ఇతర అంశాలపై సుదీర్ఘంగా అవగాహన కల్పించారు.

గ్రామాల్లో మేకలు, గొర్రెలకు టీకాలు ప్రారంభం

దెందులూరు: మండలంలో గ్రామగ్రామాన గొర్రెలు, మేకల్లో పారుడు వ్యాధి (పీపీఆర్) నివారణలో భాగంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వ్యాక్సిన్ ఉచితంగా టీకాలు అందజేశారు. దెందులూరు మండల పశువైద్యాధికారి డాక్టర్ కే.రామ్మోహనరావు, పశువైద్య సిబ్బంది టీకాలు వేశారు. మండలంలో రైతులు, పశు సంవర్ధక శాఖ ఉచితంగా వేసే టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్‌గా శ్రీదేవి



పోతునూరు సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి

దెందులూరు: మండలంలోని పోతునూరు ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్‌గా శ్రీదేవి బాధ్యతలు స్వీకరించారు. శనివారం పోతునూరులో ఆమె మాట్లాడుతూ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు సకాలంలో పౌష్టికాహారం అందించేందుకు కార్యకర్తలు, ఆయాల సహాయ సహకారాలతో కృషి చేస్తామన్నారు.

పింఛన్ అందజేత



గుంటూరు ఆసుపత్రికి వెళ్లి కొత్తపల్లి సరోజినికి పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్ జ్యోతి

దెందులూరు: మండలంలోని శ్రీరామపురం గ్రామానికి చెందిన వలంటీర్ కొత్తపల్లి జ్యోతి గుంటూరులోని ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొత్తపల్లి సరోజినికి వితంతు పింఛన్ అందజేశారు. కొత్తపల్లి సరోజిని అనారోగ్యంతో గుంటూరులోని ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ గుంటూరు వెళ్లి సరోజినికి 2,750 పింఛన్ సొమ్మును అందజేశారు. ఈ సందర్భంగా కొత్తపల్లి నరేష్, పార్టీ మండల కన్వీనర్ నాని, ఎంపీడీవో లక్ష్మీ వలంటీర్ మానవత్వాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

బాధిత కుటుంబానికి సాయం

భీమడోలు : ఇటీవల అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన పోలసానిపల్లి ఆరో వార్డుకు చెందిన మద్దాల శ్రీమన్నారాయణ కుటుంబాన్ని శనివారం పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమా బేగం హసీనా, వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించి వారికి బియ్యం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సర్వం కోల్పోయిన ఆ కుటుంబాన్ని మానవతా దృక్పథంతో దాతలు ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం నుంచి సహాయం అందించేందుకు తాను కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ అంబటి నాగేంద్ర ప్రసాద్, నాయకులు చెరుకూరి మధు, చెరుకు మధు, నాగబాబు, వీఆర్వో సింహాచలం, వలంటీర్ హిమబిందు పాల్గొన్నారు.

అచ్చమ్మపేరంటాలమ్మను దర్శించిన దర్శకుడు బాబి



అచ్చమ్మపేరంటాలమ్మ తల్లిని దర్శించుకున్న వాల్తేరు వీరయ్య దర్శకుడు బాబి

దెందులూరు: గాలాయగూడెం అచ్చమ్మపేరంటాలమ్మ తల్లిని వాల్తేరు వీరయ్య సినీ దర్శకుడు బాబి శనివారం దర్శించుకున్నారు. ముందుగా దర్శకుడు బాబికి ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారిని ఉత్సవాల సమయంలో దర్శించుకోవడం నా అదృష్టమన్నారు. వాల్తేరు వీరయ్య సినిమాను ఇంత ఘన విజయం సాధించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి జ్ఞాపిక, దుశ్శాలువాతో బాబిని కమిటీ సభ్యులు సత్కరించారు.

జగనన్న సారథ్యంలోనే సుపరిపాలన

- ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- జల్లికాకినాడలో గడపగడపకు మన ప్రభుత్వం



జల్లికాకినాడలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో సంక్షేమ పథకాలతో సుపరిపాలన సాగుతోందని, నిజమైన సంక్షేమాన్ని ఆచరణలో అమలుచేసి చూపిస్తున్నారని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శనివారం గణపవరం మండలం జల్లికాకినాడలో నిర్వహించిన 131వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన పథకాలు వివరించారు. నవరత్నాల పథకాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్ని తరగతుల ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇన్ని సంక్షేమ పథకాలను అమలు చేసిన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను నూరుశాతం అమలుచేసిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని సగర్వంగా చెప్పగలమని అన్నారు. సంక్షేమపాలన జగనన్నకే సాధ్యమన్న విషయాన్ని ప్రజలంతా గ్రహించారని, మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే అధికారం అప్పగించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎవ్వరికైనా అర్హత ఉండి పథకాలు అందకపోతే వారికి ఆ పథకాలు మంజూరు చేయడం జగన్ పాలనలోనే జరుగుతుందన్నారు. ఈసందర్భంగా ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అర్హులు మిగిలి ఉంటే మరోసారి ఇంటి స్థలాలిస్తామని హామీ ఇచ్చారు. కొందరు రోడ్లు, మంచినీరు, డ్రెయినేజీ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మనబడి, నాడునేడు కార్యక్రమం ద్వారా మార్చివేశామని, కార్పొరేటు సదుపాయాలతో విద్యను అందిస్తున్నామని, అమ్మఒడి, విద్యాకానుక, విద్యాదీవెన తదితర పథకాలను ఉపయోగించుకుని మీ పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అర్థవరం రాము, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు రాము, సర్పంచ్ బాతు నాగేశ్వరరావు, ఎంపీటీసీ దిలీప్ వర్మ, మాజీ ఎంపీటీసీ ఇందుకూరి రామకృష్ణంరాజు, పార్టీ నాయకులు సోడదాసి జైపాల్, బుజ్జి రాజు, దావీదు, నరేష్, అప్పనపేట ఎంపీటీసీ, సర్పంచ్‌లు సత్యనారాయణ, నక్కా సూరిబంగారయ్య, సొసైటీ అధ్యక్షుడు కొలనువాడ శ్రీనివాసరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దోసపాడులో పరిశుద్ధ ఆరోగ్యమాత మహోత్సవాలు



ఆర్‌సీఎం చర్చిలో పరిశుద్ధ ఆరోగ్యమాత మహోత్సవంలో మాట్లాడుతున్న పారిస్ క్రిస్ట్ పీ.డేవిడ్‌రాజు

దెందులూరు: మండలంలోని దోసపాడు ఆర్‌సీఎం చర్చిలో శనివారం పరిశుద్ధ ఆరోగ్యమాత మహోత్సవాలను పోతునూరు ఆర్‌సీఎం పారిస్ క్రిస్ట్ పీ.డేవిడ్‌రాజు ప్రారంభించారు. చర్చి ఎదుట పతాకాన్ని ఎగురవేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం పరిశుద్ధ జపమాల నిర్వహించారు. చర్చిలో వాక్యపరిచర్య చేశారు. మహోత్సవాలకు కొవ్వలి, పోతునూరు, ఉంద్రాజవరం, కేదవరం, కొమరేపల్లి, దెందులూరు నుంచి భక్తులు హాజరయ్యారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



సువార్త మహాసభల్లో ప్రసంగిస్తున్న రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత

భీమడోలు : ఏసు క్రీస్తు బోధనలు అనుసరణీయమని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. గుండుగొలనులో ఏసుక్రీస్తు ప్రార్థన మందిరం దైవజనులు పాకలపాటి జాన్‌వెస్లీ ఆధ్వర్యంలో స్తుతి యాగం పేరిట మూడురోజులుగా నిర్వహిస్తున్న ఏసుక్రీస్తు సువార్త ఉజ్జీవ మహాసభల్లో భాగంగా శుక్రవారం రాత్రి జరిగిన సువార్త మహాసభల్లో హోం మంత్రి తానేటి వనిత పాల్గొని మాట్లాడారు. 2019 ఎన్నికల్లో గొల్యాతు లాంటి టీడీపీపై దావీదు వంటి బాలుడైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యుద్ధం చేసి గెలుపొందాడన్నారు. ప్రజల ఆశీస్సులు, విశ్వాసుల ప్రార్థనల వల్లే ఇంతటి భారీ విజయాన్ని పొందారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండో సారి సీఎం చేసేందుకు ప్రతి ఒక్కరూ ప్రార్థనలు చేయాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాబినెట్‌లో తాను మంత్రిగా చేయడం తన అదృష్టమన్నారు. క్రైస్తవ విశ్వాసులంతా ఈ ప్రభుత్వానికి అండగా ఉండి దీవించాలన్నారు. మహాసభల్లో పాస్టర్ పాకలపాటి జాన్‌వెస్లీ దైవ సందేశాన్ని అందించారు. అనంతరం ఆమెను దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కూర్మా లక్ష్మీరాజ్‌కుమార్, ఉప సర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు, దైవజనులు పాకలపాటి యోహాన్, దైవజనులు, విశ్వాసులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

పెదపాడు: మండలంలోని గృహనిర్మాణాలు వేగవంతం చేయాలని పెదపాడు మండల ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీ అధికారి మల్లిఖార్జునరావు తెలిపారు. పెదపాడు గ్రామంలోని సాయిబాబా ఆలయం ప్రక్కన ఉన్న లేఅవుట్ వద్ద హౌసింగ్ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లిఖార్జునరావు మాట్లాడుతూ గ్రామాల వారీగా హౌసింగ్ ఇళ్ల పూర్తి చేసేందుకు టార్గెట్‌లు ఫిక్స్ చేయాలని సూచించారు. లేఅవుట్‌ల వారీగా ఇళ్ల ప్రారంభానికి గల అవంతరాలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులతో మాట్లాడి వీలైనంత త్వరలో ఇళ్ల నిర్మాణం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెదపాడు తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు, ఎంపీడీవో ఎస్‌నిర్మలజ్యోతి, హౌసింగ్ ఏఈ లక్ష్మణ్, పెదపాడు ఈఓ ఈర్డీ ఎస్ సూర్యకుమార్, ఏపీఎం దాసరి సుమలత, ఎలక్ట్రికల్ ఏఈ రాంబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి మల్లిఖార్జునరావు



పైడిచింతపాడులో హౌసింగ్ డే నిర్వహిస్తున్న దృశ్యం

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

దెందులూరు: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లో జగనన్న ఇళ్ల నిర్మాణం బృహత్తర కార్యక్రమమని ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పళ్ళెం ప్రసాద్ అన్నారు. శనివారం ఏలూరు రూరల్ మండలం పైడిచింతపాడు గ్రామంలో సర్పంచ్ ముంగర తిమోతి ఆధ్వర్యంలో హౌసింగ్ డే జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన స్టేట్ డైరెక్టర్ పళ్ళెం ప్రసాద్ మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలని, రోడ్లు, తాగునీరు, విద్యుత్‌తోపాటు మెటీరియల్ ఆలస్యం కాకుండా ఉండేందుకు సకాలంలో గోడౌన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏలూరు మండల స్పెషల్ ఆఫీసర్ కుమిది, ఏలూరు తహసీల్దార్ బీ.సోమశేఖర్, ఎంపీడీఓ ప్రణవీ, హౌసింగ్ డీఈ సోమశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దాళ్వా సాగులో మంచి దిగుబడులు సాధించాలి



దెందులూరు ఆర్‌బీకేలో రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

దెందులూరు: వ్యవసాయశాఖ సలహాలు, సూచనలు పాటిస్తూ దాళ్వాసాగులో మంచి దిగుబడులు సాధించాలని వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గిరిజా కుమారి, లక్ష్మీ, భావన, రేవతి, ప్రమీల, జ్యోతిక అన్నారు. దెందులూరులో రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయశాఖాధికారి గద్దె రమేష్ ఆధ్వర్యంలో దాళ్వా వరి పంటలో కాండంతొలుచు పురుగును గమనించి వాటి నివారణా చర్యలను రైతులకు వివరించారు. రైతులు అనవసరంగా ముందస్తు స్ప్రేయింగ్స్ చేయరాదని, దీనివల్ల పెట్టుబడి అధికం అవుతుందని తెలిపారు. పైరు పై పురుగు, తెగులు ఉధృతి కనిపిస్తేనే మందులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ రామకృష్ణ, రమేష్, రైతులు ఉన్నారు.

సీతారాముల శాంతి కల్యాణం



స్వామి, అమ్మవార్లకు తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

భీమడోలు : గుండుగొలనులోని శ్రీసీతారామస్వామి ఆలయంలో శనివారం స్వామి, అమ్మవార్ల జన్మ నక్షత్రం పునర్వసును పురస్కరించుకుని శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండ గంగరాజ్‌కుమార్ పర్యవేక్షణలో అర్చకులు సాయి సుధీరాచార్యులు, యాజ్ఞిక స్వామి గోపాలాచార్యులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను జరిపారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. ఆలయంలోని ధృవ మూర్తులకు అభిషేకాలు, ఉత్సవ మూర్తులకు శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం కోవెల ప్రదక్షిణలు చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఉపాధి పనులు పారదర్శకంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డ్వామా పీడీ రాంబాబు

ఉంగుటూరు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు పాదర్శకంగా నిర్వహించాలని డ్వామా పీడీ రాంబాబు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో 20-21, 21-22 రెండేళ్లలో జరిగిన ఉపాధి పనులపై ఆడిట్ నివేదిక వివరాలను ప్రజావేదిక సభ ద్వారా వెల్లడించారు. ఈ సభలో రాంబాబు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి 100 రోజులు పని చూపించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఎటువంటి అవినీతికి తావులేకుండా పనులు జరపాలని అన్నారు. ప్రజావేదిక సభలో 27 గ్రామ పంచాయతీలలో జరిపిన 8 మంది సోషల్ ఆడిట్ సభ్యులు గుర్తించిన పనులు, నష్టం వివరాలను గ్రామాలవారీ వివరించారు. ఈజీఎస్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఎస్‌ఏ ద్వారా రెండేళ్లలో రూ.23,95,71,605 విలువ గల 2,959 పనులు పూర్తిచేసినట్లు వెల్లడించారు. వేజి కాంపొనెంటు కింద రూ.19,38,67,127 చెల్లించగా, మెటీరియల్ కింద రూ.4,57,44,700 ఖర్చుచేశారు. పనుల్లో జరిగిన లోపాలను గుర్తించి రూ.89,920 రికవరీ చేయాలని ఆదేశించారు. ఎన్ఆర్ఈజీయస్ జంగారెడ్డిగూడెం ఏపీడీ ప్రఫుల్లకుమార్, తహసీల్దార్ వెంకటరమణ, ఏపీపీ ఘంట శ్రీలక్ష్మి, ఎన్ఆర్ఈజీయస్ విజిలెన్స్ జిల్లా అధికారి ఎ.విజయలక్ష్మి, డీఆర్‌డీఏ ఏపీవో వెంకట అప్పారావు, సొసైటీ అధ్యక్షుడు పాపారావు, బాబ్జి, ఉంగుటూరు ఏపీవో ప్రసన్నరాజు, ఈవోపీఆర్‌డీ షంషుద్దీన్, డీపీఆర్‌సీలు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

పెదవేగి : మండలంలోని పినకడిమి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో గంజి రాజ్‌మనోజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరుని పరిశీలించి ఎంపీడీవో సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది అందరూ ప్రజలకి పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. అదేవిధంగా రికార్డులన్నీ సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. వివిధ పథకాల ప్రగతిని, సర్వేలను ఎంపీడీఓ అడిగి తెలుసుకున్నారు.

నేడు ఎమ్మెల్యే వాసుబాబు పర్యటన

భీమడోలు : భీమడోలు, పోలసానిపల్లి గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు శనివారం రాత్రి తెలిపారు. దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోని భీమడోలు గొలుసుల గేటు సమీపాన నిర్మించిన శ్రీదేవుల‌పల్లి మృత్యుంజయుడు సత్రం నూతన భవనాన్ని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రారంభిస్తారన్నారు. అదే విధంగా మధ్యాహ్నం 3 గంటలకు పోలసానిపల్లిలో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే వాసుబాబు ప్రారంభిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం



నూతన గృహాలకు శంకుస్థాపన చేసి మార్కింగ్ చేస్తున్న సర్పంచ్ షేక్ రహీమాబేగం

భీమడోలు : పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమా బేగం హసీనా అన్నారు. పోలసానిపల్లిలో జగనన్న లేఅవుట్‌లో శనివారం కోట ఏసుమణి, కాగితాల సీతమ్మలకు కేటాయించిన ఇండ్ల స్థలాల్లో నూతన గృహా నిర్మాణాలకు ఆమెకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తున్నారన్నారు. ఇండ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు దశల వారీగా వారి ఖాతాల్లోకి నేరుగా నగదును ప్రభుత్వం జమ చేస్తోందన్నారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అంబటి నాగేంద్ర ప్రసాద్, నాయకులు చెరుకూరి మధు, వార్డు సభ్యుడు కోట శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అరుణ్, వలంటీర్ చిరంజీవి, నాయకులు చెరుకు మధుబాబు, చెరుకు నాగబాబు, మంచెం నాగు, కోట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు గడువు పెంచాలి

పెదపాడు: ధాన్యం కొనుగోలు గడువును పెంచాలని కోరుతూ పెదపాడు గోగుంట, పెదపాడు జాలిపూడి, చాటపర్రు సొసైటీ అధ్యక్షుడు జిల్లా జాయింట్ కలెక్టరు అరుణ్‌బాబును కలిసి వినతి పత్రాన్ని అందించారు. చాటపర్రు సొసైటీ పరిధిలో 200ఎకరాల్లో 3198 మెట్రిక్ టన్నుల ధాన్యం, జాలిపూడిలో 150 ఎకరాల్లో 1221 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని గోగుంట సొసైటీ పరిధిలో ఇంకా 1400 ఎకరాలు, పెదపాడు సొసైటీ పరిధిలో 1860 ఎకరాలు ఇంకా నూర్పిడి చేయాల్సి ఉందని ఈ విషయాన్ని గమనించాలని జేసీని కోరారు. అపరాలు పంట కారణంగా రైతులు ఇంకా మాసూళ్లు పూర్తి చేయలేదని, దీనిని దృష్టిలో ఉంచుకుని ధాన్యం కొనుగోలు గడువును పెంచాలని కోరుతూ శనివారం వినతి పత్రాన్ని అందించారు. దీంతో జేసీ అరుణ్‌బాబు సానుకూలంగా స్పందించారని సొసైటీ అధ్యక్షులు తెలిపారు. వినతి పత్రాన్ని అందించిన వారిలో గోగుంట సొసైటీ అధ్యక్షుడు భావరాజు సత్యన్నారాయణ, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, చాటపర్రు సొసైటీ అధ్యక్షుడు ఎస్ రవీంద్రనాథ్‌ఠాగూర్, జాలిపూడి సొసైటీ అధ్యక్షుడు బొల్లిముంత రామ్మోహనరావు, తదితరులు ఉన్నారు.

రైతుల సమస్యను దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి జేసీ అరుణ్‌బాబు దృష్టికి తీసుకువెళ్లారు. నియోజకవర్గపరిధిలోని కొన్ని గ్రామాల్లో మాసూళ్లు పూర్తి కాలేదని అపరాల పంటలు పాడయ్యే అవకాశమున్నందున మాసూళ్లు పూర్తి చేయాలని మరింత గడువునివ్వాలని కోరారు. దీంతో జేసీ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

జగన్ పాలనలోనే మైనార్టీలకు న్యాయం



డా.కామిల్‌జమ, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్

గణపవరం : రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని, జగన్ పాలనలోనే మైనార్టీలకు న్యాయం జరుగుతుందని ఏలూరు జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ డా.ఎండీ కామిల్ జమ అన్నారు. శనివారం ఆయన గణపవరంలో విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌పాలపై నమ్మకం ఏర్పడటంతో ముస్లిం మైనార్టీలంతా ఆయన వెంటే ఉన్నారన్నారు. గత గురువారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో తాడేపల్లిలోని శుభమస్తు కన్వెన్షన్ హాలులో జరిగిన హర్‌దిల్‌మే వైఎస్సార్-హమ్‌సబ్ జగన్‌కేసాథ్ కార్యక్రమంలో పార్టీలకతీతంగా రాష్ట్రంలోని ముస్లిం పెద్దలు, ప్రముఖులు అంతా పాల్గొన్నారని వారంతా వైఎస్సార్‌సీపీ పాలనలోనే ముస్లింలకు రక్షణ, న్యాయం జరుగుతుందన్న అభిప్రాయాలను వ్యక్తం చేశారన్నారు. వచ్చే ఎన్నికలలో ముస్లింలంతా వైఎస్సార్‌సీపీకు అండగా ఉంటారని ఆయన తెలిపారు. జగన్ పాలనలో ముస్లింలకు అన్యాయం జరుగుతుందని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ఆపార్టీ నేతలు చేస్తున్న ప్రచారాన్ని ముస్లింలెవరూ నమ్మే పరిస్థితిలేదన్నారు. కనీసం ఒక్క ముస్లింకు మంత్రిపదవి ఇవ్వని చరిత్ర చంద్రబాబుదని అన్నారు. అరకొరగా ముస్లింలకు రంజాన్‌తోఫా అంటూ హడావుడి చేసి ముస్లింలకు న్యాయంగా రావలసిన నిధులు, ఇతర పథకాలు ఎగ్గొట్టారని దుయ్యబట్టారు. అన్నివర్గాలతో సమానంగా ముస్లింలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు తామంతా అండగా ఉండి వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి తమవంతు సహకారం చేస్తామన్నారు. ఈయనతోపాటు వైఎస్సార్‌సీపీ ముస్లిం నాయకులు ఎండీ షకీల్ పాల్గొన్నారు.

భోగాపురంలో హౌసింగ్ డే



హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంపీడీఓ

పెదవేగి : మండలంలోని భోగాపురం సచివాలయంలో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజ్ మనోజ్ మాట్లాడుతూ భోగాపురంలో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకొని త్వరలో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని తెలియజేశారు. అదేవిధంగా మండల ప్రత్యేక అధికారిని నాగరాణి మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశం వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా సమావేశ అనంతరం పదిమంది లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకోవడానికి ముందుకు రావడం జరిగిందని, వారికి త్వరలో బిల్డింగ్ మెటీరియల్ అందించడం జరుగుతుందని హౌసింగ్ ఏఈ తెలియజేశారు. ఆర్డబ్ల్యూఎస్ శ్రీకాంత్, ఏఈ హౌసింగ్ నాగరాజు , సర్పంచ్, హౌసింగ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

సాగునీటి సమస్య రానీయకండి

అధికారులకు సూచించిన ఎమ్మెల్యే వాసుబాబు



సాగునీటి సమస్యపై క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం : దాళ్వా పంటకు సాగునీటి సమస్య తలెత్తకుండా ఇరిగేషన్, వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అధికారులకు సూచించారు. శనివారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజగకవర్గం లోని నాలుగు మండలాలకు చెందిన నీటిపారుదల, వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివారు ప్రాంతాలకు కూడా సాగు నీరు సరిపడా అందేలా చూడాలని, అవసరమైతే అడ్డుకట్టలు నిర్మించడం, ఇంజిన్ల ద్వారా నీరు అందించడం వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి పెట్టాలని ఆయన ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. గణపవరం, నిడమర్రు మండలాలలో శివారుప్రాంత ఆయకట్టు భూములకు మామూలు రోజులలోనే సాగునీటి సమస్య ఉంటుందని, అందువల్ల అధికారులు ఆప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సాగునీరు అందక నియోజకవర్గంలో ఒక్క ఎకరం పంట కూడా నష్ట పోకూడదన్నారు. నియోజవర్గంలో మొత్తం 60 వేల ఎకరాలలో దాళ్వా సాగు జరుగుతుందని అధికారులు వాసుబాబు దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతానికి నీటిలభ్యత సరిపడా ఉందని, ఇప్పటికే వంతులవారీ విధానాన్ని అమలు చేస్తున్నామని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ఆయా మండలాల వారీగా సాగు వివరాలు, శివారు ప్రాంతాలలో ఎన్నిఎకరాలు ఉందన్న వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. మూడు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సాగునీటి సమస్య రాకుండా చూడాలని కోరారు. ఈ సమీక్షలో జిల్లా వ్యవసాయ సలహాసంఘం చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, నాలుగు మండలాలకు చెందిన మూడు శాఖల అధికారులు పాల్గొన్నారు.